





కేఎంసీలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి

- ఎంజీఎం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో నిల్
- కార్డియాలజిస్టులు లేక రోగుల ఇబ్బందులు
- ఒకే ఒక వైద్యురాలు.. వందల సంఖ్యలో రోగులు..
- నియమించాలని ప్రజల వేడుకోలు

హృదయ విదారకం

కానరాని కార్డియాలజీ సేవలు

వరంగల్ మెడికల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎంలో కార్డియాలజీ సేవలు మృగ్యమయ్యాయి. ఎంజీఎంతోపాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కూడా వైద్యుల కొరత వల్ల కార్డియాలజీ సేవలు పేదలకు అందని ద్రాక్షగానే మారాయి. సామాన్య మధ్య తరగతి ప్రజలకు భారంగా ఉన్న కార్డియాలజీ సేవలు పేదల ఆస్పత్రిలో లేకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుత కాలంలో అనేక మంది గుండె జబ్బులకు లోనవుతున్నారు. అంతేకాకుండా ఏ సర్జరీ చేయాలన్నా కార్డియాలజీ వైద్యుల సలహా రోగులకు అవసరం. ఈ సేవలు ఎంజీఎంలో లేకపోవడంవల్ల ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే జేబులకు చిల్లులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్డియాలజిస్టు ఒక్కరే..

కార్డియాలజీ విభాగంలో ఒకే ఒక్క వైద్యురాలు విధులు నిర్వర్తిస్తున్నారు. మరో ఇద్దరు కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్నారు. కార్డియాలజీ సేవలు బలోపేతం చేయాలంటే రోగుల సంఖ్యకు సరిపడా వైద్యులను నియమించాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరో ముగ్గురు అసిస్టెంటు ప్రొఫెసర్లను నియమిస్తే తప్ప సమస్యకు పరిష్కారం లేదని ఎంజీఎం అధికారులు చెబుతున్నారు.

అలంకారప్రాయంగా 2డీ ఏకో

గుండె జబ్బుల రోగులకు నిర్వహించే 2డీ ఏకో పరీక్ష జరిపే యంత్రం సూపర్ స్పెషాలిటీలో ఒకటి, ఎంజీఎం ఆస్పత్రిలో మరొకటి ఉన్నాయి. రెండింటికీ కలిపి ఒకే టెక్నీషియన్ ఉండటంతో మూడు రోజులు చొప్పున అక్కడ, ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. మొత్తం కార్డియాలజీ విభాగంలో నలుగురు ఈసీజీ టెక్నీషియన్లు ఉండగా ఒకరు 2డీ ఏకో పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిత్యం వందలాది రోగులు 2డీ ఏకో పరీక్ష కోసం వస్తూ ఉంటారు. ఇతర విభాగాలలో సర్జరీల కోసం కూడా సర్జరీ ప్రొఫైల్‌లో ఈ పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. రెండు యంత్రాలు ఉన్నా టెక్నీషియన్ లేకపోవడం వల్ల పరీక్షలు నిర్వహించడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం రోజు 100 మందికి మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నారని, మరికొందరికి ఫలానా రోజు రమ్మని తేదీలు ఇచ్చి పంపుతున్నట్లు సమాచారం.



కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని కార్డియాలజీ విభాగం



కేఎంసీలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉన్న ఒకే ఒక్క 2డీ ఎకో యంత్రం

2డీ ఏకో యంత్రాలు అవసరం

కార్డియాలజీ విభాగంలో 2డీ ఏకో పరీక్షలు నిర్వహించే యంత్రాలు అవసరమని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఒక్కొక్క యంత్రం ఖరీదు రూ.12 లక్షల 50 వేలు ఉంటుందని తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్డియాలజీ విభాగంలో మౌలిక వసతులు కల్పించడం లోపాటు వైద్యుల కొరత తీర్చాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.



కార్డియాలజీ విభాగం వద్ద కోసం బారులు తీరిన ఔట్‌పేషెంట్లు

నెలరోజులుగా తిరుగుతున్నా..

ఉష, హనుమకొండ

నాకు ఇప్పటికే ఓపెన్‌హార్ట్ అయింది. హైదరాబాద్ నిమ్స్‌లో చేయించుకున్నా. ఈ మధ్య కాలంలో గైనిక్ సమస్య ఏర్పడింది. గర్భసంచి తొలగించాలని వైద్యులు సూచించారు. కానీ కార్డియాలజీ అభిప్రాయం తప్పనిసరి అని వైద్యులు సూచించడంతో ఇక్కడికి వస్తే పట్టించుకునే వారే లేరు. నాకు వేసెక్టమీ ఆపరేషన్ చేయాలంటే ఆ సమయంలో కార్డియాలజిస్టు, సర్జన్లు కలిసి చేయాలని చెప్పారు. ఇద్దరు విభాగాలు కలవడం కష్టం, హైదరాబాద్‌కు వెళ్లమని సూచించారు. ఇంత పెద్ద ఆస్పత్రి ఉండి ఏమి లాభం.

2డీ ఏకోకు డిమాండ్

ఎంజీఎంతోపాటు వరంగల్ సీకేఎం, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, హనుమకొండ ప్రభుత్వ టీబీ ఆస్పత్రి రోగుల ఈ పరీక్ష కోసం వస్తుంటారు. తేదీలు ఇచ్చి పంపిస్తుండటంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక అత్యవసర కేసులు అయితే అంతే సంగతులని వాపోతున్నారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా మరో నలుగు టెక్నీషియన్లను నియమించాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు ములుగులో మంత్రి సీతక్క పర్యటన

- 'మల్లంపల్లి మండలం' ప్రారంభోత్సవం
- మేడారం చిన్న జాతరపై అధికారులతో సమీక్ష



మంత్రి సీతక్క

ములుగు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన మల్లంపల్లి మండలాన్ని ప్రారంభిస్తారు. తహసీల్, మండలపరిషత్ కార్యాలయాలకు ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం తాడ్వాయి మండలం మేడారంలో చిన్నజాతర నిర్వహణపై అధికారులతో జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. అటవీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. జలగలంచ వద్ద ఏర్పాటు చేసిన బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌ను ప్రారంభిస్తారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పస్రా ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ దివాకర



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

గోవిందరావుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందుతాయని, లబ్ధిదారుల ఎంపికపై వస్తున్న అపోహలను ఎవరూ నమ్మవద్దని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. మండలంలోని పస్రా గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామసభలలో స్వీకరించిన దరఖాస్తులు, గతంలో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని తొలి జాబితాలు ప్రకటించడం జరుగుతుందని, పూర్తి పరిశీలన అనంతరమే తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారులు ఇప్పుడే కాకుండా ఎప్పటికైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఆయా పథకాలకు అర్హత ఉన్న లబ్ధిదారులను కచ్చితంగా గుర్తించి అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లతోపాటు నూతన రేషన్‌కార్డుల పంపిణీని నిరంతరం కొనసాగిస్తామని, నిజమైన అర్హులను గుర్తించిన అనంతరమే గ్రామసభల్లో పేర్లు ప్రకటించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్‌రెడ్డి, తహసీల్దార్ సృజన్‌కుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

- పరేడ్ సాధన చేసిన పోలీసులు



పరేడ్ సాధన చేస్తున్న పోలీసులు

ములుగు కలెక్టరేట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. జిల్లాకేంద్రంలోని తంగేడు స్టేడియంలో ఈనెల 26న కార్యక్రమాలను ఘనంగా జరిపించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర పర్యవేక్షణలో అధికారులు టెంట్లు వేయిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను తెలియజేసేలా స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. పాల్గొనే విద్యార్థులు, ప్రజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, గురువారం జిల్లా పోలీసులు పరేడ్ సాధన చేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ సదానందం పర్యవేక్షించారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు, రిమాండ్

ములుగు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు పాల్పడుతున్న హైదరాబాద్‌కు చెందిన ముగ్గురిని గురువారం అరెస్టు చేసిన ములుగు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ శంకర్ వివరాలను వెల్లడించారు. ములుగుకు చెందిన మహ్మద్ ఇలియాస్ తనకు వాట్సప్‌లో వచ్చిన షేర్‌ఇండియా యాప్ లింకును ఓపెన్ చేశాడు. ఈ యాప్‌లో పెట్టుబడులు పెడితే ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చని నమ్మాడు. యాప్‌లో వచ్చే నిబంధనలను పాటిస్తూ ప్రతీరోజూ కొంతమొత్తం పెట్టుబడిగా పెట్టాడు. కొన్నిరోజుల తర్వాత డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా సాధ్యం కాకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్‌చేసి అయనిచ్చిన ఫిర్యాదును నమోదు చేసిన పోలీసులు ఇలియాస్ పంపిన డబ్బులు జమ అయిన అకౌంట్‌ను గుర్తించి ఫ్రీజ్ చేశారు. దర్యాప్తు ముమ్మరం చేయగా హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్రార్, మహ్మద్ నొమన్, మహ్మద్ మసూద్ ముఠాగా ఏర్పడి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శంకర్ వివరించారు.

ప్రజాపాలన గ్రామసభల్లో
జనం నిలదీత

- పథకాల అమలు నిరంతర ప్రక్రియ అంటూ నచ్చచెబుతున్న అధికారులు
- తొలివిడత జాబితాలో పేర్లు లేకపోవడంతో ప్రజాగ్రహం

8



రామన్నగూడెంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో
పేరు లేదని..

- గ్రామసభలో ఒకరి ఆత్మహత్యాయత్నం
- పురుగుల మందు తాగిన నాగేశ్వర్‌రావు
- లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని వాగ్వాదం

6



చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని యోధ, దేవ్ ప్రైవేటు ఆసుపత్రులను గురువారం డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలపై బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ లేని ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రుల్లో ఓపీ ఫీజు, టెస్టుల వివరాలు తెలిపే విధంగా బోర్డులను తెలుగులో ఏర్పాటు చేయాలన్నారు. డాక్టర్లు, స్టాఫ్ వివరాలను బహిరంగంగా ప్రచురించాలని ఆదేశించారు. అర్హత గల సిబ్బందినే ఆసుపత్రిలో నియమించుకోవాలని అన్నారు. సిజేరియన్లు తగ్గించి సాధారణ ప్రసవాలు చేయాలని వైద్యులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి తదితరులున్నారు.



ప్రైవేటు ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

జిల్లా కోర్టులో క్రీడోత్సవాలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భారత దేశ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టులో గురువారం క్రీడలకు శ్రీకారం చుట్టారు. క్రీడలను జిల్లా జడ్జీ నారాయణబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జీ కాసేపు ఆహ్లాదంగా గడిపారు. స్వయంగా క్యారంబోర్డు, చెస్ ఆడి అందరిని ప్రోత్సహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడలు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జీ కె. జయరాంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అనితావాని, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్యారమ్ ఆడుతున్న జిల్లా జడ్జీ నారాయణబాబు

కాళేశ్వరం ప్రాజెక్టును 'కాగ్' తప్పు పట్టింది

ప్రాజెక్టుకు ఏడాదికి రూ.13వేల కోట్లు వడ్డీలు

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

వివరాలు 7వ పేజీలో

మూడు రోజుల్లో ముగింపు..



- ఈ నెల 26తో మునిసిపల్ అధికారాలకు గడువు పూర్తి
- కౌన్సిలర్లకు ఇవే ఆఖరి గణతంత్ర వేడుకలు
- కుంటుపడిన అభివృద్ధి పనులు
- అధికారుల పాలన ఎన్నాళ్లో..?

భూపాలపల్లిటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మరో మూడు రోజుల్లో మునిసిపల్ అధికార బాధ్యతలు పాలకవర్గానికి ముగియనున్నాయి. వారికి గణతంత్ర వేడుకలు కూడా ఇవే చివరివి. ఎందుకంటే.. ఈ నెల 26తో వారి పదవీకాలం ముగుస్తుంది. ఒకవైపు పదవి కాలం ముగుస్తుందనే బాధ, మరోవైపు కాంట్రాక్టు చేసిన బిల్లులు రాలేదని మరి కొందరి బాధ పలువురు కౌన్సిలర్లను వేదిస్తోంది. 50శాతానికి పైగా అభివృద్ధి పనులను ఒకే ఒక కాంట్రాక్టర్ చేపట్టడం, బిల్లులు సకాలంలో రాకపోవడంతో పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. అభివృద్ధి కుంటుపడింది. పాలకవర్గం ఉంటేనే పనులు చక్కబడే పరిస్థితి లేని ఈ రోజుల్లో.. అధికారుల పాలనలో ఇంకేం పట్టించుకుంటారనే వాదనలు లేకపోలేదు.

26 తేదీతో పదవీకాలం ముగింపు..

2020 జనవరి 27న మునిసిపల్ పాలక వర్గం అధికారికంగా కొలువుదీరింది. అయితే ఈ నెల 26తో ఐదేళ్ల పదవీ కాలం ముగియనుండడంతో 27నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలు కానుంది. మునిసిపల్ ఎన్నికలు ఇప్పట్లో జరిగే పరిస్థితి కనిపించడం లేదు. పైగా గతంలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అధికారం చేపట్టగా ప్రస్తుతం వరకు కూడా వారే కొనసాగుతున్నారు. కానీ ఇక్కడ రాజకీయ పరిణామాలు మారడం, గతంలో పనిచేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఓటమి చెందడం, ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే అధికారంలో ఉండడంతో పరిస్థితులు భిన్నంగా మారేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది నూతన ఆశావహులు, యువకులు, గతంలో పోటీ చేసి ఓడిపోయిన వారు ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ఇదిలా వుంటే.. ప్రస్తుతం వరకు కొనసాగుతున్న కౌన్సిలర్లు కొందరు బినామీ కాంట్రాక్టర్లుగా చెలామణి అయ్యారు. ఈ క్రమంలో వారు చేసిన పనులకు ఇప్పటివరకు బిల్లులు రాలేదు. దీంతో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం లోటుబడ్జెట్‌లో ఉందని, బిల్లులు

మిగతా 8వ పేజీలో...



అధికారులతో వాగ్వాదం చేస్తున్న నాగేశ్వరరావు

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు లేదని..

- గ్రామసభలో ఒకరి ఆత్మహత్యాయత్నం
- పురుగుల మందు తాగిన నాగేశ్వర్‌రావు
- జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని వాగ్వాదం

కన్నాయిగూడెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని బుట్టాయిగూడెం గ్రామ సభలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు లేదని ఒకరు ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. బుట్టాయిగూడెం పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన కుమ్మరి నాగేశ్వరరావు గురువారం అధికారులు నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభకు హాజరయ్యాడు. గ్రామ సభ ప్రారంభం కాగానే అధికారులు అర్హుల జాబితాను చదివి వినిపించారు. ఆ లిస్టులో నాగేశ్వరరావు పేరు లేకపోవడంతో మనస్తాపం చెంది అధికారులతో అర్హుల జాబితాలో తన పేరు ఎందుకు లేదని ప్రశ్నించాడు. చదివిన జాబితాలో చాలా మంది అనర్హుల పేర్లు ఉన్నాయని అధికారులతో వాగ్వాదం జరిగింది. అధికారులు వివరణ ఇస్తుండగానే తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన వెంట తెచ్చుకున్న పురుగులమందు తాగాడు. పక్కనే ఉన్నవారు అడ్డుకునే ప్రయత్నం చేసినా వినలేదు. అధికారులు వెంటనే అంబులెన్సు ద్వారా ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించి అక్కడి నుంచి ములుగుకు పంపి చికిత్స అందించారు. అక్కడి డాక్టర్ల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. నాగేశ్వరరావు వ్యవసాయం చేస్తూ ఉండగా అతడి భార్య శాంతి అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తమకు ముగ్గురు పిల్లలున్నారని, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు రాకపోవడంతోనే తన భర్త ఆత్మహత్యాయత్నం చేశాడని నాగేశ్వర్‌రావు భార్య శాంతి తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి కన్నాయిగూడెం తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అనిత ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నాగేశ్వర్‌రావు భార్య శాంతి బుట్టాయిగూడెంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోందని, ఆ కుటుంబానికి వ్యవసాయ భూమి కూడా ఉందని తెలిపారు. మరలా దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉంటే లబ్ధి చేకూర్చుతామని చెప్పినా ఆయన క్షణికావేశంలో పురుగుల మందు తాగాడని పేర్కొన్నారు.

అక్రమ క్షేత్ర పరిశీలనపై రైతుల ఆందోళన




కేసముద్రం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

కేసముద్రం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధన్నసరి శివారు కొత్తూరు, పెద్దమోరితండా సమీపంలోని పంటభూముల్లో గురువారం కొంత మంది వ్యక్తులు బ్యాంకు అధికారులతో కలిసి క్షేత్ర పరిశీలన చేశారని ఆయా గ్రామాల్లోని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధన్నసరి పరిధిలో కొంతమంది ఎలాంటి భూములు లేకున్నప్పటికీ అక్రమంగా అటవీహక్కుపత్రాలను పొందారని ఆరోపించారు. ఇలా అక్రమంగా పట్టాలు పొందిన వ్యక్తులు బ్యాంకు అధికారులు, సిబ్బందితో కలిసి తమ పంటపొలాలను సదరు వ్యక్తులకు చెందినవిగా చూపుతూ క్షేత్రపరిశీలనలో ఫొటోలు దిగారని తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి అక్రమ పట్టాలు పొందిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు అపార్ గుర్తింపు

- కొనసాగుతున్న నమోదు ప్రక్రియ
- జిల్లావ్యాప్తంగా లక్షకు పైగా స్టూడెంట్స్
- సాంకేతిక సమస్యతో నమోదు ఆలస్యం



తొర్రూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం 'అపార్' రూపొందించింది. అపార్ అంటే ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ. ఇందులో ఒక విద్యార్థికి సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. అతడు ఏ తరగతి ఎక్కడ చదివాడో అనే వివరాలు ఉంటాయి. ఈ అపార్‌లోని 12 అంకెల నంబర్‌తో ఉన్నత చదువులు, ప్రాజెక్టులు, ఇంటర్వ్యూలు వంటి వాటికి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులకు కేంద్రప్రభుత్వం 12 అంకెల నంబర్‌తో అపార్ నమోదుకు ఆదేశాలు ఇవ్వగా, ఈ ప్రక్రియను మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కొనసాగిస్తున్నారు. ఈ నంబర్ భవిష్యత్‌లో విద్యార్థులకు కీలకంగా మారనుంది. ఆన్‌లైన్ నమోదు చేపడుతున్నారు. ఈ నెలఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలనే నిబంధన ఉంది. జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో లక్షకు పైగా విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇందులో ఉంటుంది. ఏ ఏ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి అనే వ్యక్తిగత వివరాలూ ఉంటాయి. భవిష్యత్‌లో ఇది ప్రామాణికంగా మారనుండటంతో జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో అపార్ నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నారు.

వన్ నేషన్- వన్ స్టూడెంట్ ఐడీలో భాగంగా..

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన వన్ నేషన్ వన్- స్టూడెంట్ ఐడీ కార్యక్రమం ఇది. అపార్ ఐడీ ద్వారా విద్యార్థుల పురోగతిని పరిశీలించవచ్చు. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ కావాలన్నా, ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఈఐడీని ఉపయోగించుకోవచ్చు.

భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగ దరఖాస్తులకు సైతం ఇది పనిచేస్తుందని విద్యా శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. అపార్ ఐడీని నమోదు చేయాలని ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యూడైస్‌లో ఇప్పటికే ఉన్న విద్యార్థుల పర్మినెంట్ ఎన్‌రోల్‌మెంట్ నంబర్ వివరాలు సరిపోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. చాలామంది విద్యార్థులు వ్యక్తిగత వివరాలు, సమాచారానికి సరిపోకపోవడంతో నమోదు ఆలస్యం అవుతుందని కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి చేసేందుకు చర్యలు

జిల్లాలోని 18 మండలాల పరిధిలో 1218 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో లక్షా 112 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అన్ని పాఠశాలల్లో అపార్ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అపార్‌లో పేరు మార్పులు, ఇతర అక్షర దోషాలు, సాంకేతిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పుట్టిన తేదీ ఇతర మార్పులతో కాలయాపన జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గడువు తేదీ వరకు అపార్ నమోదును పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

మహంకాళి బుచ్చయ్య, విద్యాశాఖ నోడల్ అధికారి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

డోర్నకల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. గురువారం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువగా ఇంగ్లిష్ సబ్జెక్టులో మార్కులు తక్కువగా వచ్చి ఫెయిల్ కావడం జరుగుతుందని, విద్యార్థులకు ఇంగ్లీష్‌ను ఒక భాషగా నేర్పించి భయాన్ని తొలగించాలని సూచించారు.

ముగ్గురు ఉపాధ్యాయులతో పాఠాలతో పాటు ప్రత్యేకంగా గ్రామర్ నేర్పిస్తున్నట్లు హెచ్‌ఎం బండి నర్సింహరావు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుల ఇటీవల సాయంత్రం వేళల్లో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారిని తమ పిల్లలు క్రమంతప్పకుండ పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్న విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలను వైద్యాధికారి సాద్విజను అడిగి తెలుసుకున్నారు. అస్పత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచే విధంగా చూడాలని ఆదేశించారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు నమోదు

వాజేడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మిర్చి తోట వద్ద మంచంలో నిద్రిస్తున్న వ్యక్తిపై మరోక వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన ఘటనలో ఒకరిపై హత్యాయత్నం కేసు నమోదైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వాజేడు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ధర్మవరంనకు చెందిన గార శ్రీనివాసరావు చీకుపల్లిలోని మిర్చి తోట వద్ద బుధవారం రాత్రి మంచం మీద నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో చీకుపల్లికి చెందిన గొంది లింగమూర్తి అనే వ్యక్తి పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని శ్రీనివాసరావుపై గొడ్డలితో దాడి చేశాడు. గొడ్డలి దాడిలో కాలుకి, చేతికి తీవ్రగాయాలు అయ్యాయి.

గాయాలైన శ్రీను కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని వాజేడు ఆస్పత్రికి అక్కడి నుంచి మేరుగైన వైద్యం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్సను అందిస్తున్నారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మునిసిపల్ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



మునిసిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్నను సన్మానిస్తున్న సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ కవిత

మహబూబాబాద్ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మానుకోట మునిసిపల్ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు కలిసికట్టుగా అహర్నిశలు కృషి చేశారని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో పీఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం మునిసిపల్ పాలకమండలి సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ తాను కూడా మానుకోట వాసినేనని, ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. పాలకమండలి సభ్యులు తమ ప్రాంతానికి సేవ చేయాలనే తపనతో రాజకీయాలకు వచ్చి, ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ఐదేళ్ల పాటు పనిచేసి ప్రజా అభ్యున్నతికి సమర్థవంతగా కృషి చేశారని వారిని అభినందించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో మానుకోట జిల్లా కేంద్రంగా అప్‌గ్రేడ్ అయిందని, తద్వారా పట్టణం అభివృద్ధి చెందిందని చెప్పారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో మానుకోట పట్టణాభివృద్ధి కోసం పార్టీల కతీతంగా పాలకమండలి సభ్యులమంతా కలిసిట్టుగా పని చేశామని చెప్పారు. ఐదేళ్లు సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం పాలకమండలి సభ్యులను శాలువాలతో ఘనం గా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ ఫ్లోర్‌లీడర్లు వెన్నం లక్ష్మారెడ్డి, సూర్నపు సోమయ్య, బి.అజయ్‌సారథిరెడ్డి, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం'

మహబూబాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్‌లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 64 మందికి రూ. 11,32,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలందుతాయని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు జీ రవినాయక్, అల్లూరి కిషోర్‌వర్మ, బోడ శ్రీనునాయక్, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, బాదె నాగయ్య, నెహ్రూనాయక్, గంగాధర్‌రెడ్డి, అర్జున్‌చౌహన్, బొమ్మకంటి వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల రద్దీ

తాడ్వాయి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మేడారంలో భక్తుల రద్దీ కొనసాగింది. గురువారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో పరిసరాలన్ని సందడిగా మారాయి. మినీ జాతరకు ముందుగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవార్లకు పూలు, పండ్లు, చీరె, సారె, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. చల్లగా చూడాలని కోర్కెలు తీరాలని దేవతలను వేడుకున్నారు. సుమారు పది వేల మందికి పైగా భక్తులు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు దేవస్థానంలో మహాజాతర సమయంలో భక్తుల రద్దీతో పగిలిన బండలను తొలగించి మరమ్మతులు చేపట్టారు. ఈ క్రమంలో గద్దెలు, ప్రాంగణంలో గురువారం ఈ పనులు చేపట్టగా ఈవో రాజేంద్రం పరిశీలించారు.

తాగునీటి ఏర్పాటుకు స్థలం గుర్తింపు

మేడారం తరలి వచ్చే భక్తులకు నిరంతరం తాగునీటిని అందించే దిశగా మిషన్ భగీరథ, దేవాదాయ శాఖ అధికారులు గద్దెల ముఖ ద్వారం ముందు స్థలాన్ని తాగునీటి ఏర్పాట్లకు గుర్తించారు. మిషన్ భగీరథ నీరు నిరంతరం భక్తులకు అందుబాటులో ఉంటుందని ఈవో తెలిపారు.



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డైరెక్టర్ కాంతి వెస్లీ

మెరుగైన వసతుల కల్పనకు కృషి

మహిళా, శిశు అభివృద్ధి, షెడ్యూల్డ్ కులాల డైరెక్టర్ కాంతి వెస్లీ

చిట్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా బాలికల గురుకుల పాఠశాలల వసతులు, విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి, షెడ్యూల్డ్ కులాల శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ గురువారం స్థానిక గురుకులాన్ని సందర్శించారు. అంతకుముందు మండల కేంద్రంలోని రెండు అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థినులతో కలిసి రాత్రి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మెస్ చార్జీలు పెంచడం, అన్ని గురుకులాల్లో ఒకే మెనూ ప్రకటించడం జరిగిందన్నారు. సీఎం ఆదేశాలతో గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి రాత్రి బస చేయడం, వారి సమస్యలు తెలుసుకోవడం, ఇంకా మెరుగైన విద్యను అందించేందుకు చర్చించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థినులతో కలిసి నిద్రించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి చెన్నయ్య, ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ హేమ, సీడీపీవోలు శ్వేత, మల్లీశ్వరి, ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి, అంగన్వాడీ సూపర్‌వైజర్ జయప్రద తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి : కలెక్టర్



భోజనం, కూరలను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, రుచికరమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. గురువారం ఆయన ములుగు మండలంలోని ఇంచర్ల గ్రామశివారులోని గిరిజన గురుకులాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల పరిసరాలు, వంటగదిని, ఆహార పదార్థాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు నిత్యం పరిశీలిస్తూ ఉన్నత చదువులు చదివేవిధంగా నాణ్యమైన బోధన చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన మేరకు ప్రతిరోజు మెనూ పాటించాలని, సమయానికి ఆహారం అందించడంతోపాటు నూతన పరిజ్ఞానంతో కార్పొరేట్‌స్థాయి పాఠశాలలకు దీటుగా విద్యను బోధించాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గుడుంబా పట్టివేత

నెహ్రూసెంటర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బయ్యారం మండలంలోని ఉప్పలపాడు, కురవి మండలంలోని తట్టుపల్లిలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సీఐ చిరంజీవి గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. బోడగుట్టతండాకు చెందిన భూక్య భద్రు, చిన్నగూడూరు మండలం మంగొలిగూడెంకు చెందిన తేజావత్ నవీన్ ఇద్దరిపై కేసు నమోదు చేసి వారి నుంచి 16 లీటర్ల గుడుంబాను, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సంబంధిత వారిని ఆయా తహసీల్దార్‌ల వద్ద బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై అశోక్, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులను హరిస్తున్న పాలకులు

తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య

వడ్డెపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జల్, జమీన్, జంగల్ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఆదివాసీల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా హరిస్తున్నాయని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య దుయ్యబట్టారు. గురువారం హనుమకొండ అంబేడ్కర్ భవన్ రోడ్డులోని అశోక కాలనీలో గల గిరిజన భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా తుడుందెబ్బ మహాసభలు జరిగాయి. మొదటగా ఆదివాసీల ఆరాధ్యుడు కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. తుడుం దెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆగబోయిన రవి అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ముఖ్య అతిథిగా హాజరైన బుర్స పోచయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రాజ్యాంగం 5వ షెడ్యూల్ ద్వారా గుర్తించిన భూభాగ హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని, అమలు చేసేంత వరకు పాలకులపై నిరంతర పోరాటం చేస్తామని హెచ్చరించారు. గిరిజనేతరుల చేతుల్లో ఉన్న గిరిజనుల భూములను 1/59, 1/70చట్టాల ప్రకారం ప్రభుత్వం ఆదివాసీలకే చెందాలని కోనేరు రంగారావు కమిషన్ సిఫారస్ చేసిందని అన్నారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ఏరియాలో పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ఆదివాసీలకు స్వయంప్రతిపత్తిని కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వనరుల దోపిడీని అరికట్టి కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ఏరియాల్లో 1960 వడ్డీవ్యాపార నిషేధ చట్టాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. జీవో ఎంఎస్ నంబర్ 317ను షెడ్యూల్డ్ ఏరియాల్లో రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సదస్సులో తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్లు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, గుర్రాల రవీందర్, చంద రఘుపతి, సోయం రాజేందర్, ఇప్ప విజయ, సోయం రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహం నుంచి గిరిజన భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు.



తుడుం దెబ్బ ఉమ్మడి జిల్లా మహా సభలో మాట్లాడుతున్న బుర్స పోచయ్య



మహాసభలో అభివాదం చేస్తున్న తుడుం దెబ్బ నేతలు

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6250	5600
పల్లికాయ (పచ్చిది)	4600	4100
కందులు	6852	5560
పెసళ్లు	6822	2800
పత్తి	7100	5800
కొత్త పత్తి	-	-
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14300	9000
తేజ ఏసీ	13000	11000
వండర్‌హాట్	13500	11500
యూఎస్341	15500	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఆదర్శంపై ఆసక్తి

» ఆదర్శ పాఠశాలపై తల్లిదండ్రుల చూపు
» ఉత్తమ ఫలితాల సాధనతో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
» కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆరు నుంచి ఇంటర్ వరకు విద్య
» ప్రవేశాలకు తుది గడువు ఫిబ్రవరి 28

నెక్కొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో ఇంగ్లిష్ మీడియంలో విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆదర్శ పాఠశాలలకు జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోంది. విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందించడం, ఉత్తమ ఫలితాలను సాధించడమే కాకుండా ఆరు నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు విద్యాబోధన చేస్తుండడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. వరంగల్ జిల్లాలో 2013లో ఆరు పాఠశాలలు నెక్కొండ, పర్వతగిరి, చెన్నారావుపేట(అమీనాబాద్). సంగెం(గవిచర్ల), ఖానాపురం (బుధరావుపేట), గీసుగొండ (వంచనగిరి) మండలాల్లో ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలల్లో రాబోయే విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలతోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకూ ఖాళీగా ఉన్న సీట్ల భర్తీలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో యేటా ఈ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి మొదటి స్థానంలో నిలుస్తున్నారు.

ఫిబ్రవరి 28 వరకు గడువు

ప్రణయ్ కుమార్, ఆదర్శ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్



ఆదర్శ స్కూల్, కళాశాలల్లో అడ్మిషన్ పొందేందుకు ఫిబ్రవరి 28 వరకు గడువు ఉంది. అడ్మిషన్ కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో వంద సీట్లు ఉండగా, ఏడు నుంచి పదో తరగతి వరకూ ఖాళీలను భర్తీ చేస్తాం. ఇందుకు గాను ప్రవేశ పరీక్షలను ఆదర్శ పాఠశాలల్లో నిర్వహిస్తాం. ప్రవేశ పరీక్షకు ఓసీ విద్యార్థులు రూ.200, ఇతరులు రూ.125 చెల్లించాల్సి ఉంటుంది.



నెక్కొండలోని ఆదర్శ పాఠశాల

బాలికలకు ప్రత్యేక హాస్టల్

తొమ్మిది. పదో తరగతి, ఇంటర్మీడియేట్ చదువుతున్న బాలికలకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యం ఉంది. రవాణా ఇబ్బందులు కూడా లేవు. ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులు ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతుండగా, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు విశాలమైన హాస్టల్ గదులు ఉన్నాయి. గదుల్లో విద్యార్థుల సంఖ్య కూడా పరిమితంగానే ఉంది. ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించడం, విద్యార్థులకు వైద్య చికిత్సలకు ఎఎన్ఎం ఉండడంతో ప్రశాంత వాతవరణంలో విద్యనభ్యసిస్తున్నారు.

విశాలమైన క్రీడాస్థలాలు

ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక శాతం ప్రధాన పట్టణాల్లో ఉండడడం, క్రీడా స్థలాలు లేక విద్యార్థులు శారీరక ఎదుగుదలకు అవరోధం ఏర్పడుతుండగా, ఆదర్శపాఠశాలలు మాత్రం ప్రశాంత వాతవరణంలో విశాలమైన క్రీడా స్థలాలు ఏర్పాటు చేశారు.



కొల్లాపురంలో మొసలిని బంధించిన అధికారులు

పొలంలో మొసలి

పట్టుకుని పాకాల సరస్సులో వదిలేసిన అటవీ అధికారులు

గూడూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నీటిలో ఉండాల్సిన మొసలి పంటపొలాల్లోకి వచ్చిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో గురువారం జరిగింది. రైతులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గూడూరు మం డలం కొల్లాపురం గ్రామంలో ఓ పెద్ద మొసలి వాగు అంచు నుంచి బయటకొచ్చి పంట పొలాల్లో ప్రత్యక్షమైంది. పొలానికి నీరు పెట్టిందుకు వెళ్తున్న రైతులకు కనిపించడంతో గూడూరు అటవీశాఖ రేంజ్ అధికారి సురేష్‌కు సమాచారం అందించారు. దీంతో అధికారులు కొల్లాపురానికి చేరుకొని, మొసలిని తాడుతో బంధించి ప్రత్యేక వాహనంలో గూడూరు రేంజ్ కార్యాలయానికి తరలించారు. 12 అడుగుల పొడవు, 270 కిలోల బరువున్న ఈ మొసలిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరంగల్ జిల్లాలోని ఖానాపురం మండలం పాకాల సరస్సులో వదిలారు. రెండేళ్ల వ్యవధిలో ఐదుసార్లు కొల్లాపురం, రాములుతండా, లక్ష్మీపురం, దామెరవంచ గ్రామాల్లోకి ఇదే తరహాల్లో మొసళ్లు వచ్చాయని, వాటిని కూడా పాకాల సరస్సులో వదిలేసినట్టు రేంజ్ అధికారి సురేష్ తెలిపారు. వర్షకాలంలో పాకాల సరస్సు నుంచి వాగుల ద్వారా నీటి ప్రవాహానికి మొసళ్లు బయటకు వస్తుంటాయని వివరించారు. మొసలిని తరలించిన వారిలో సెక్షన్ అధికారి సంతోష్‌కుమార్, బీట్ అధికారి సురేష్, బేస్‌క్యాంప్ సిబ్బంది బొజ్యా, స్వామి, నరేష్, బాలాజీ, ఈడీసీ వాచర్స్ రమేష్, సురేష్ ఉన్నారు.



పాకాల సరస్సులో మొసలిని వదిలిన అటవీ శాఖ అధికారులు

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

» రాజ్‌కుమార్ హత్య కేసులో నిందితుడి అరెస్టు
» వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అదాలత్ జంక్షన్ వద్ద బుధవారం జరిగిన ఆటోడ్రైవర్ రాజ్‌కుమార్ హత్యకు మహిళతో వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు రాజ్‌కుమార్‌ను హత్య చేసిన నిందితుడు వెంకటేశ్వర్లును గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు సుబేదారి పోలీసుస్టేషన్‌లో ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలను మీడియాకు వెల్లడించారు.

కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన నిందితుడు ఏనుగుల వెంకటేశ్వర్లు, అదే గ్రామానికి చెందిన మాచర్ల రాజ్‌కుమార్ ఇద్దరు ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇద్దరికీ ఓ మహిళతో ఏర్పడిన వివాహేతర సంబంధం కారణంగా గతంలో పలుమార్లు ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. సదరు మహిళ నిందితుడు వెంకటేశ్వర్లును దూరం పెట్టడం తో పాటు రాజ్‌కుమార్‌తో సన్నిహితంగా ఉండడంతో కోపం పెంచుకు న్నాడు. ఎలాగైనా రాజ్‌కుమార్ హత్యకు వెంకటేశ్వర్లు పథకం వేశాడు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు ఓ కత్తిని ఆటోలో పెట్టుకొని తిరుగుతుండగా బుధవారం ఉదయం 11.30 గంటలకు అదాలత్ జంక్షన్ వద్ద ఆటోలో రాజ్‌కుమార్‌ను చూశాడు. దీంతో వెంకటేశ్వర్లు తన ఆటోతో రాజ్‌కుమార్ ఆటోను ఢీకొట్టి గొడవకు దిగాడు. ఆపై రాజ్‌కుమార్‌పైకి కత్తి తీసుకొని దాడి చేశాడు. అందరూ చూస్తుండగానే కత్తితో పలుమార్లు దాడి చేశా రు. విషయం తెలుసుకున్న సీఐ సత్యనారాయణరెడ్డి పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని రాజ్‌కుమార్‌ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

కాగా, రాజ్‌కుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న వెంకటేశ్వర్లును గురువారం హనుమకొండ బస్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ ఘటన జరుగుతున్న సమయంలో 20 మంది యువకులు చూస్తూ ఉండిపోయారని, ఎవరూ కూడా ఆపే ప్రయత్నం చేయకపోవడం బాధగా ఉందని ఏసీపీ తెలిపారు. అన్ని వైపులా పోలీసులు ఉండరని ప్రజలు, యువకులు కళ్లముందు నేరం జరిగినప్పుడు స్పందించాలన్నారు. ఆ సమయంలో కాపాడే ప్రయత్నం చేస్తే రాజ్‌కు మార్ ప్రాణాలు దక్కేవని ఏసీపీ పేర్కొన్నారు. కాగా, ఈ హత్యకు వివా హేతర సంబంధం పెట్టుకున్న మహిళ ప్రమేయం లేదని ఈ సంద ర్భంగా ఏసీపీ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ పి.సత్యనారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగేతర భూములకు రూ.164.79 కోట్ల రైతు బంధు



• అప్పనంగా కట్టబెట్టిన గత బీఆర్ఎస్ సర్కారు
• కోల్డ్ సోరేజీలు, ఫంక్షన్ హాళ్లకు సైతం
• సర్వేలో వెల్లడవుతున్న నమ్మలేని నిజాలు

హనుమకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతు బంధు పేరుతో సాగేతర భూములకు సైతం రూ.167.79 కోట్లను అప్పనంగా చెల్లించింది. రైతులకు పెట్టుబడి సాయం కింద వారిని ఆదుకునేందుకు గత ప్రభుత్వం 2018లో రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది తెలిసిందే. పథకం మంచిదే అయినా అమలులో చోటు చేసుకున్న అవకతవల వల్ల ప్రజాధనం దారుణంగా దుర్వినియోగం అయినట్టు వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న సర్వేలో వెల్లడైంది. రైతు భరోసా పేరుతో ఈ పథకాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. రైతు బంధు దుర్వినియోగం అయినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రక్షాళనను చేపట్టింది. ఇందులో భాగంగా రైతుబంధు వర్తిస్తున్న సాగేతర భూములు ఏ మేరకు ఉన్నాయనేది తేల్చేందుకు సర్వేకు ఆదేశించింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో వ్యవసాయాధికారులు గురువారం వరకు జరిపిన సర్వేలో మొత్తం 27,466 ఎకరాలు సాగేతర భూమిగా గుర్తించారు. ఇందులో హనుమకొండ జిల్లాలో 6100 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 2357 ఎకరాలు, జనగామ జిల్లాలో 5996 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 8135 ఎకరాలు, ములుగు జిల్లాలో 2667 ఎకరాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2490 ఎకరాలు సాగేతర భూమిగా నిర్ధారించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ భూములకు 12 సార్లు రైతు బంధు కింద ఏడాదికి రెండు పంటలకు గాను ఎకరానికి రూ. 10వేల చొప్పున చెల్లించారు. అంటే ఈ లెక్కన ఏడాది రూ. 60వేల చొప్పన ఇప్పటి వరకు 12 విడతల 27,466 ఎకరాల సాగేతర భూమికి రూ. 164,79,60,000 చెల్లింపు జరిగింది. సర్వే పూర్తి చేయడానికి ఇంకా రెండు రోజుల సమయం ఉంది. తుది అంచనా ప్రకారం ఈ సాగేతర భూముల మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది. గత ప్రభుత్వం రైతు బంధును కోల్డ్ స్టోరేజీలు, ఫంక్షన్ హాళ్లకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, బీడు భూములకు కూడా ఇవ్వడంతో ప్రజాధనం పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయినట్టు సర్వేలో వెల్లడైంది.

కాళేశ్వరం ప్రాజెక్టును 'కాగ్' తప్పు పట్టింది

» ప్రాజెక్టుకు ఏడాదికి రూ.13 వేల కోట్ల వడ్డీలు » ఎమ్మెల్సీ కోదండరామ్

భీమదేవరపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టును కాగ్ నివేదిక తప్పు పట్టిందని, డ్యామ్ సెఫ్టీ అధికారులు.. పెద్ద పెద్ద ప్రాజెక్టులు నిర్మించే ఇంజనీర్లు సైతం తప్పుపట్టారని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అవసరం లేని చోట కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి, వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ప్రకాష్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై అబద్ధాలు చెబుతూ తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కోదండరామ్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సంవత్సరానికి రూ.13వేల కోట్ల వడ్డీలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. రూ.85వేల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు రూ.1.50వేల కోట్లకు పెరిగిందన్నారు. ఎవరిది తప్పో.. ఎవరిది ఒప్పో.. కుంగిన కాళేశ్వరం ప్రాజెక్టు చెబుతుందన్నారు. ఇలా అందరూ తప్పు పడితుంటే.. కాళేశ్వరం ప్రాజెక్టు బాగానే ఉందని ప్రకాష్‌రావు లాంటి వారు మాట్లాడి ప్రజల ముందు అపహాస్యం పాలవుతున్నారన్నారు. ఈ నెల 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలు ప్రజలకు అమలవుతాయన్నారు. గత ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు అప్పులు చేస్తే వాటికి వడ్డీలు చెల్లించలేక ప్రభుత్వం అవస్థలు పడుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్సీ కోదండరామ్‌ను మంత్రిగా చూడవచ్చానని ఓ విలేఖరి ప్రశ్నించగా.. కాలమే నిర్ణయిస్తుందని సమాధానాన్ని కోదండరామ్ దాట వేశారు.



ధర్మారంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

పని ఒత్తిడిలో ఆర్టీసీ డ్రైవర్లు

» సిబ్బంది కొరతతో రెట్టింపు డ్యూటీలు
» ఏళ్లు గడిచినా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం
» నేడు ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం

హనుమకొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎంతో మందికి మెరుగైన ప్రయాణం అందించి వారి గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకం. 70 ఏళ్ల ఆర్టీసీ చరిత్రలో డ్రైవర్లు పనిభారంతో చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నారు. నేడు ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా డ్రైవర్ల స్థితిగతులపై కథనం.

డబుల్ డ్యూటీలు

ఆర్టీసీ వరంగల్ రీజినల్ పరిధిలోని 9 డిపోల పరిధిలో ఆర్టీసీ డ్రైవర్లు అదనపు డ్యూటీలు చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సరిపడా సిబ్బంది లేక అనారోగ్యంతో ఉన్నప్పటికీ సెలవులు ఇవ్వకుండా డ్రైవర్లను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ రీజినల్ పరిధిలో 1235 మంది ఆర్టీసీ డ్రైవర్లు పని చేస్తున్నారు. బస్సులకు సరిపడా డ్రైవర్లు లేకపోవడంతో డ్రైవర్లు రెట్టింపు డ్యూటీలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఒత్తిడితో విధులు నిర్వర్తించి నిద్రలేని రాత్రులు గడుపుతూ కుటుంబాలకు, పండుగలకు దూరమవుతున్నట్లు వాపోతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు జనగామలో నిర్వహించిన కాంగ్రెస్ సభలో రాహుల్‌గాంధీ సమక్షంలో అప్పటి టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డికి ఆర్టీసీ డ్రైవర్లు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. అప్పుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ కార్మికులకు పెండింగ్ బకాయిలను చెల్లిస్తూ రావాల్సిన పీఆర్సీని అందించి రద్దయిన కార్మిక సంఘాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఆర్టీసీ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.



బస్సుల వద్ద ఆర్టీసీ డ్రైవర్లు

అదనపు పనిభారం

ఆర్టీసీలో డ్రైవర్ల కొరత ఇబ్బంది పెడుతోంది. దీంతో 12 గంటలు పనిచేయాల్సిన కార్మికులు.. డబుల్ డ్యూటీలు చేస్తున్నారు. దీంతో పని ఒత్తిడికి గురై వరుస ప్రమాదాలు జరుగుతున్నట్లు డ్రైవర్లు వాపోతున్నారు. అలాగే ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కార్మికులకు ఆర్టీసీ కార్పొరేషన్ చాలీ చాలని జీతాలు ఇస్తోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి బెన్‌ఫిట్స్ అందక జీతాలు సరిపోక డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ జిల్లా సెక్రటరీ యాకస్వామి

ఆర్టీసీలో కార్మికులకు పెండింగ్ బకాయిలు చెల్లించి వెంటనే ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలి. 2021 పీఆర్సీని అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. రిటైర్డ్ అయిన కార్మిక కుటుంబాలకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

పసిడి ధర పైపైకి..

తులం రూ. 82,580 » వెండి తులం రూ. 940

» రూ. లక్షకు చేరువలో బంగారం

వరంగల్ చౌరస్తా, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. వివాహాల సీజన్ ప్రారంభం కాకముందే బంగారం ధర భగ్గుమంటోంది. గురువారం 24 క్యారెట్ల తులం బంగారం రూ.82,580 ధర కాగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం (నవరస్) రూ. 76,470 పలికింది. తులం వెండి రూ. 940 ధర పలికింది. రోజు రోజుకూ బంగారం ధరలు పెరగడంతో సామాన్యులకు వివాహాల సమయంలో కొనుగోలుకు అందని ద్రాక్షగా నిలిచేలా ఉంది. పెళ్లి ముహూర్తాల సీజన్ ప్రారంభం కాకముందే బంగారం, వెండి ధరలు పెరగడంతో, వేసవి కాలం పెళ్లిళ్ల సీజన్ వరకు తులం బంగారం రూ.లక్ష వరకు చేరుకుంటుందని వ్యాపారవర్గాలు అంచనా వేస్తున్నాయి. రికార్డు స్థాయిలో ఇప్పటికే రూ.80 వేల పైచిలుకు ధర పలకడంతో బంగారం కొనుగోలు, అమ్మకాలు నిర్వ హించేవారు పెదవి విరుస్తున్నారు. దుకాణాల యజమానులు సైతం ఇంత ధర పెరగడంతో పెట్టుబడి పెట్టడం కూడా కష్టమైన పనేనని వాపోతున్నారు. రాబోయే రోజుల్లో బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపార వర్గాలు తెలుపుతున్నారు.



స్వయం సహాయక సంఘ సభ్యురాలికి అరుదైన గౌరవం

ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు ఆహ్వానం



గన్నీ బ్యాగుల తయారీలో కల్పన

శాయంపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు దాసరి కల్పనకు అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకలలో సెర్ప్ తరఫున మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదిగిన కల్పన వేడుకలలో పాల్గొనడంతో పాటు కేంద్ర మంత్రులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొననున్నారని గురువారం ఏపీఎం శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. సాధారణ మహిళగా ఉన్న కల్పన స్వయం సహాయక సంఘంలో సీఆర్‌పీగా వివిధ రాష్ట్రాలలో సేవలు అందించడంతోపాటు స్వయం ఉపాధితో పారిశ్రామిక వేత్తగా ఎదిగి తోటి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం నుంచి ఓ మహిళ పాల్గొనే అవకాశం దక్కిందని ఏపీఎం తెలిపారు. దీంతో హర్షం వ్యక్తం చేసిన కల్పన దంపతులు గురువారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

టేకు వనాలే.. దేవుళ్లుగా

రామలక్ష్మణులుగా ఆరాధిస్తున్న గ్రామస్థులు

టేకు వనాలనే దేవుళ్లుగా భావించి.. ఆ రెండు చెట్లను రామలక్ష్మణు లని పిలుచుకుంటున్నారు కమలాపూర్ గ్రామస్థులు. భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామ సమీపంలో వందేళ్లకు పైబడిన రెండు టేకు చెట్లలో ఒక చెట్టుకు రాము.. మరో చెట్టుకు లక్ష్మణ్ అని పేర్లు పెట్టుకున్నారు. మొదటి చెట్టు 65 అడుగుల పొడవు, రెండో చెట్టు 55 అడుగుల పొడవు ఉంది. రెండేసి చెట్లు సుమారు 15 అంగులాల వెడల్పు ఉండటం అందరిని ఎంతగానో ఆకర్షిస్తోంది. కాగా, ఏళ్ల తరబడి ఉంటున్న ఆ టేకు వనాలకు గ్రామస్థులు మేడారం జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కాగా, ఆ వనాలకు పేర్లు పెట్టడం అందరిని ఎంతగానో ఆకర్షిస్తోంది.


భూపాలపల్లి కృష్ణకాలనీ, ఆంధ్రజ్యోతి



మానవ అక్రమ రవాణా

నిర్మూలనకు కృషి చేయాలి

హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాథోడ్ రమేష్

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు అందరు కలిసికట్టుగా పనిచేయాలని హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ అన్నారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాల్లోని ఎన్జీవోలకు మానవ అక్రమ రవాణా నిర్మూలన, వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలనపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆర్డీవో రాథోడ్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఇంకా కొన్ని రంగాలలో మానవ అక్రమ రవాణాను నిర్మూలించడానికి కారణమైన అంశాలను ఎన్జీవోలు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, దానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత శాఖలకు తెలపాలన్నారు. అనంతరం మానవ అక్రమ రవాణా నిర్మూలనకు, బాండెడ్ లేబర్ నిర్మూలన కొరకు కృషి చేస్తామని ఎన్జీవోలు ప్రతిజ్ఞ చేశారు. దానికి సంబంధించిన పుస్తకాలను విడుదల చేశారు. ఎఫ్ఎంఎం సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకన్న, హనుమకొండ జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు, హైదరాబాద్ ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ నుంచి అడ్వొకేట్ మేరక మని, మాజీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మండల పరశురాములు, హనుమకొండ జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికి సుధాకర్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, ప్రాజెక్టు మేనేజర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాపాలన గ్రామసభల్లో జనం నిలదీత

● పథకాల అమలు నిరంతర ప్రక్రియ అంటూ నచ్చచెబుతున్న అధికారులు ● తొలివిడత జాబితాలో పేర్లు లేకపోవడంతో ప్రజాగ్రహం ● ఉద్రిక్తంగా మారుతున్న గ్రామసభలు



భూపాలపల్లి పట్టణంలోని 20వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కమలాపురం గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు



ఆదివారంపేట గ్రామసభలో ప్రజలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

ములుగు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన గ్రామసభలు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఈ సభలలో ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. ఈ నాలుగు పథకాలను ఈనెల 26నుంచి అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి అర్హతను బట్టి లబ్దిదారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. 21నుంచి జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. తమకున్న అర్హతలను పత్రాల రూపంలో చూపిస్తూ ప్రశ్నిస్తున్నారు. గురువారం కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో కుమ్మరి నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు లేకపోవ డంతో గ్రామసభ జరుగుతుండగానే అధికారుల ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నం చేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని బీఆర్ఎస్ నియోజ కవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రజా ప్రభుత్వా నికి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక బీఆర్ఎస్ నేతలే నాగేశ్వర్‌రావును రెచ్చగొట్టి ఆత్మహత్యకు ప్రేరేపించారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ కౌంటర్ ఇచ్చారు. కాగా, జిల్లాలో మొత్తం 174గ్రామపంచా యతీలుండగా గురువారం వరకు 137గ్రామాలలో సభలు పూర్తయ్యాయి.

●గోవిందరావుపేట : గోవిందరావుపేట మండలం పస్రాలో గురువారం జరిగిన గ్రామసభలో సీపీఎం నాయకులు ప్రజలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. 2వేల మందికి పైగా వందరోజులు పనిచేసిన ఉపాధిహామీ కూలీలుంటే కేవలం 115మందిని మాత్రమే ఆత్మీయభరోసాకు ఎంపిక చేయడం ఏమిటని ప్రశ్నించారు. . ఈ గ్రామసభకు జిల్లా కలెక్టర్ దివాకర హాజరు కాగా.. కలెక్టర్ రాకకు ముందే నిరసనకారులను సముదాయించిన పోలీసులు అక్కడి నుంచి తీసుకువెళ్లారు.

● మల్హర్ : మండలంలోని నాచారం, మల్లారం, ఇప్పలపల్లిలో గురువారం అధికారులు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. నాచారం భూములు ఉన్న వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అర్హులుగా రావడంపై గ్రామస్తులు అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన గ్రామాల్లో గ్రామసభలు మామూలుగా సాగాయి.

● ఏటూరునాగారం రూరల్ : మండలంలో పలు గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను అధికారులు నిర్వహించారు. మండలంలో గురువారం రామన్నగూడెం, రొయ్యూర్, మల్లకట్ట గ్రామపంచాయతీ పరిధిలో ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి. ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులకు అర్హులైన లబ్ధిదారుల జాబితను అధికారులు గ్రామసభలో వెల్లడించారు.

● వాజేడు : మండలంలో ప్రజాపాలన గ్రామసభలు మూడోరోజు కొనసాగాయి. మండలంలోని చీకుపల్లి, పేరూరు, పెద్దగొల్లగూడెం, ఎడ్చర్లపల్లి గ్రామపంచాయతీల్లో గ్రామసభలను అధికారులు నిర్వహించారు. ఈ క్రమంలో పేరూరు, ఎడ్చర్లపల్లి జీపీలలో అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ కొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇది నిరంతర ప్రక్రియ అని మరల దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ గ్రామసభల్లో మండల ప్రత్యేక అధికారి సర్దార్ సింగ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో శ్రీకాంత్‌నాయడుపాల్గొన్నారు.

కాటారంలో సబ్ కలెక్టర్ పర్యటన

కాటారం : అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ స్పష్టం చేశారు. ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి చేపట్టనున్న సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియని ఉద్ఘాటించారు. మండలంలోని ఆదివారంపేట జీపీ పరిధిలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో సబ్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ పేర్లు రాలేదని సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. కాగా ప్రతాపగిరి, వీరాపూర్, విలాసాగర్, బయ్యారం, అంకుసాపూర్ జీపీల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో పలువురు తమ పేర్లు లిస్టుల్లో ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. పేదోళ్ల పేర్లే లిస్టుల్లో రావా అంటూ వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, డీటీ రామ్మోహన్, ఏవో పూర్ణిమ, ఏపీవో వెంకన్న ప్రజలకు హామినివ్వడంతో సభలు సజావుగా సాగాయి.

అర్హులను గుర్తించడానికే గ్రామసభలు : ఎమ్మెల్యే

భూపాలపల్లిటౌన్ : ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలు చివరి లబ్ధిదారుడి వరకు చేరేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం, రేగొండ, గోరికొత్తపల్లి, మొగుళ్లపల్లి, టేకుమట్ల, చిట్యాల, భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో గురువారం నిర్వహిచిన గ్రామ సభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సభల్లో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమ లశాఖ మేనేజర్ సిద్ధార్థ్, మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

● గణపురం మండలంలోని ధర్మరావుపేట, కొండాపూర్ గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఎమ్మెల్యే గండ్ర పాల్గొన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీ వో భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ కుమార్ ఉన్నారు.

● చిట్యాల : మండలంలోని గోపాలపురం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీడబ్ల్యూవో చిన్నయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవీ, ఎంపీడీవో జయశ్రీ పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి : మండలంలోని ఇస్సిపేట గ్రామంలో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మండల స్పెషలాఫీసర్ సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, ఏఎంసీ చైర్మన్ శ్రీదేవి, వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింగరావు పాల్గొన్నారు.

●రేగొండ : రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని చెన్నాపూర్, కొత్తపల్లి బి గ్రామాలలో గురువారం జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, తహసీల్దార్ శ్వేతారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి సునీల్, కాంగ్రెస్ నాయకులు నర్సన్న పాల్గొన్నారు.

● టేకుమట్ల : మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలో గురువారం జరిగిన ప్రజా పాలన గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శైలజ, ఎంపీడీవో అనిత, తహశీల్దార్ విజయలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● వెంకటాపురం : మండలంలోని బీసీమత్రిగూడెం గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ రసాభాసగా కొనసాగింది. గతంలో డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకే మళ్లీ ఇళ్లు కేటాయించారని మహిళలు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా, మండలంలోని నూగూరు, సూరవీడు, ఉప్పేడు వీరాపురం పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి.

● మంగపేట : గ్రామసభలు గత రెండురోజుల నుంచి మండలంలో జరుగుతూనే ఉన్నాయి. మూడోరోజు గురువారం అకినేపల్లి మల్లారం, రమణక్కపేట, తిమ్మంపేట, బుచ్చంపేట, కమలాపురం పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. కమలాపురం గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జాబితాను అధికారులు చదువుతుండగా అర్హులైన వారి పేర్లు జాబితాలో లేకపోవడంతో ఆగ్రహించిన కొందరు గ్రామసభ జరుగకుండా అడ్డుకున్నారు. తహసీల్దార్ రవీందర్, కిషోర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు తీసుకుని..

వైద్య విద్యార్థి హల్‌చల్

● హాస్టల్ గది తలుపులు ధ్వంసం చేసిన వైనం

● గుట్టుచప్పుడు కాకుండా కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులు పక్కదారి పడుతున్నారు. ఎంత ఉన్నతమైన వైద్యవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మద్యం, మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. మెడికల్ కాలేజీ విద్యార్థి మత్తు పదార్థాలు, మద్యం సేవించి బుధవారం అర్ధరాత్రి హాస్టల్‌లో హల్‌చల్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గద్వేల్‌కు చెందిన ఓ విద్యార్థి బుధవారం తప్పతాగి, మత్తు పదార్థాలు సేవించి హాస్టల్‌లో వీరంగం చేసినట్లు సమాచారం. సదరు విద్యార్థిని తోటి విద్యార్థులు ఓ గదిలో బంధించగా అతగాడు మత్తులో గది తలుపులను ధ్వంసం చేసినట్లు సమాచారం. వెంటనే సమాచారం అందుతున్న పోలీసులు హాస్టల్‌కు చేరుకొని విద్యార్థిని గుట్టుచప్పుడు కాకుండా స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు తెలిసింది. ఈఘటనపై ఆరా తీసిన కలెక్టర్ రాహుల్‌శర్మ కాలేజీ ప్రిన్సిపాల్, హాస్టల్స్ వార్డెన్స్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గురువారం హాస్టల్ ఘటనపై స్పందించిన కాలేజీ క్రమశిక్షణ కమీటి సదరు విద్యార్థి తల్లిదండ్రులను కాలేజీకి పిలిపించి విద్యార్థిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. పర్యవేక్షణ లేకపోవడం వల్లనే విద్యార్థులు ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. కాలేజీ పరిసరాల్లో యథేచ్ఛగా మత్తు పదార్థాలు, మద్యం లభిస్తున్న నియంత్రించడంలో అధికారులు విఫలం అవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్యాలెండర్ ఆవిష్కరణ

వెంకటాపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను గురువారం ఎంఈవో టి.ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జనగాం బాబూరావు మాట్లాడుతూ సంఘం ఎస్సీఎస్టీ, బడుగు బలహీన వర్గాల ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను అనిల్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.రాధిక, సంఘం నాయకులు, ఉపాధ్యాయులు వి.రవీందర్, ఎ.రాజయ్య, సీహెచ్.శ్రీనివాస్, అంబేద్కర్, కిషోర్, వేణు, మహేష్, జగన్మోహన్, శారద పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ప్రజలను చైతన్యపరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హైరిస్క్ ప్రాంతాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలను చైతన్య పరచాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబా బాబాద్ జిల్లాల ఐసీటీసీ కౌన్సిలర్లు, లింకు వర్కర్లు, ఎన్జీవోస్‌లలో పని చేస్తున్న సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గోపాల్ రావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి కలిగిన వారు ఏఆర్‌టీ మందులు రెగ్యులర్‌గా వాడుతున్నారా లేదా చూడాలని, ఆ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే నే ఎయిడ్స్‌ను అరికట్టవచ్చని సూచించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, హెచ్ఐవీ, ఎయిడ్స్ కంట్రోల్, టీబీ నియంత్రణ, కీటకజనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ చంద్రకాంత్, ఇన్‌చార్జి డెమో సంపత్, జ్యోతి, సారయ్య, సాయి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులను మళ్లించడం సరికాదు

- మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి 2 ఇంక్లైన్ వరకు రోడ్డు విస్తరణకు మంజూరైన రూ.4 కోట్ల సీఎస్ఆర్ నిధులను మళ్లించడం సరికాదని మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోనిబీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కక్షిపూరితంగా ఆ నిధులను తన స్వంత మండలమైన గణపురం ఘణపసముద్రం చెరువు సుందీకరణకు మళ్లించుకోవడం హేయమైన చర్య అన్నారు. ఆ నిధులను వెనక్కి తీసి పనులను వెంటనే ప్రారంభించాలని ఆమె డిమాండ్ చేశారు. వైస్ చైర్మన్ హరీష్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎడ్ల మౌనిక, ఆకుదారి మమత, మేకల రజిత, కొత్త హరిబాబు, పాల్గొన్నారు.

చివరి దశకు చేరిన పీఎంఎస్‌జీఎంబీవై సర్వే

కాటారం, జనవరి23(ఆంధ్రజ్యోతి):మండలంలోని కాటారం గ్రామంలో పీఎంఎస్‌జీఎంబీవై (ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన)సర్వే చివరి దశకు చేరుకుందని విద్యుత్ అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద కాటారం గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపిక చేయగా విద్యుత్‌శాఖ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. గురువారం రైతువేదికలో విద్యుత్ మీటర్లున్న వారి వివరాలు తీసుకుని ఆన్లైన్‌లో అప్డేట్ చేశారు. నేటి వరకు 800మందికి గానూ సర్వేలో 650మందికి పైగా తమ వివరాలు అందించారని, మిగిలినవారు శుక్రవారం రైతువేదికలో విద్యుత్‌బిల్లు రసీదు, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబర్‌తో సంప్రదించాలని ఏఈ ఉపేందర్ కోరారు. సిబ్బంది ఇల్లిల్లు తిరిగిన అందుబాటులోకి రానివారు తమ వివరాలను వెంటనే రైతు వేదిక వద్దకు వచ్చి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ ఉపేందర్, సబ్‌ఇంజనీర్ రాజ్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కాంత్, లైన్‌మెన్లు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

గోవిందరావుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాలుగా ట్రెజరీల్లో ఆమోదం పొంది ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించిన అనంతరం మండలకేంద్రంలో ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. సెలవు జీతాలు, సప్లిమెంటరీ వేతనాలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, పెన్షన్, టీఎస్ జీఎల్ఐ, తదితర బిల్లులు విడుదల కాకపోవడంతో ఉద్యోగులు, గత మార్చినుంచి రిటైర్డు అయిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, కమ్యూటేషన్ మొత్తాలను చెల్లించకపోవడం వల్ల పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు సంఘం రాష్ట్ర కార్యదర్శి గొప్ప సమ్మారావు, నాయకులు కిరణ్‌కుమార్, సృజన్‌ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పొడెం సమ్మయ్య, మహిపతి సంతోష్, ములుకాల వెంకటస్వామి, పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

మహదేవపూర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల కేంద్రంలోని నిరుపేద ముస్లిం కుటుంబానికి చెందిన షేక్ రహీం చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూడు రోజుల క్రితం మహారాష్ట్ర సిరొంచవెళ్లి వస్తూ బైక్ అదుపుతప్పి కింద పడి తీవ్రగాయా లపాలయ్యాడు. చికిత్స పొందుతూ చనిపోవడంతో నిరుపేద కుటుంబానికి ఆసరా లేకుండా పోయింది.విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి ఆర్థికసాయం అందజేశారు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి పై విచారణ

కన్నాయిగూడెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుట్టాయిగూడెం ప్రజాపాలన గ్రామ సభలో గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కుమ్మరి నాగేశ్వరరావు గురించి విచారణ చేపట్టినట్లు తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ అనిత తెలిపారు. నాగేశ్వరరావు కు వ్యవసాయ భూమి కూడా ఉందని , ఇందిరమ్మ ఇళ్లు కావాలని క్షణికావేశంలో పురుగుల మందు తాగాడా.. ఎవరైనా ఉసిగొలిపారా అనే కోణంలో అధికారులు విచారణ చేపడుతున్నామన్నారు. తన వెంట తెచ్చుకున్న సంచి లోంచి పురుగుల మందు డబ్బా తీసి అధికారులను బెదిరించబోయి ఒక్క సారిగా నోట్లో పోసుకున్నాడని , వెంటనే అంబులెన్స్ ద్వారా వైద్య సేవల కోసం ధవాఖానకు తరలించా మన్నారు. గ్రామ సభ చివరి దశలో ఉద్దేశ్య పూర్వకంగా సభను తప్పు తోవ పట్టించేందుకు, ఎవరో చెప్పినట్లు గా పక్కా ప్రణాళిక ప్రకారం చేసినట్లు వ్యవహరించాడని అధికారులు తెలిపారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

కాకతీయఖని, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో నేడు(శుక్రవారం) నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయండని సీపీఐ పార్టీ భూపాలపల్లి పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని భగత్ సింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేందరంలోని సర్వేనంబర్ 280 గల భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. గుడిసె వాసులకు పట్టాలు ఇప్పించేందుకు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటం చేపట్టామన్నారు. అందులో భాగంగానే బహిరంగ సభను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారారయణరావు, సీపీఐ రాష్ట్ర సహాయక కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరు అవుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు జోసెఫ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజలను గందరగోళానికి గురిచేయొద్దు

మల్హర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపిక ప్రక్రియ నిరంతరం జరిగేదని అర్హులైన వారు ఎప్పుడైన దరఖాస్తు చేసుకోవచ్చని ఈ విషయంలో కొంత మంది కావాలని ప్రజలను గందరగోళానికి గురి చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలేవరు మధ్య దళారులను ఆశ్రయించవద్దన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపిక విషయంలో ప్రజలు ఎవరూ హైరాన పడవద్దన్నారు.

వంతెన నిర్మాణ సాధన కమిటీ ఏర్పాటు

టేకుమట్ల, జనవరి (ఆంధ్రజ్యోతి): గర్మిళ్లపల్లి-ఓడెడు గ్రామాల మధ్య గల అంతర్‌జిల్లా వంతెన నిర్మాణ సాధన కమిటీని గురువారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పొన్నం బిక్షపతిగౌడ్, కన్వీనర్‌గా మారపెల్లి మల్లేష్, కార్యదర్శిగా ఎలుకటి రాజయ్య, కో-కన్వీనర్‌గా రేణుకుంట్ల శంకర్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు భిక్షపతి, కన్వీనర్ మారపెల్లి మల్లేష్ లు మాట్లాడు తూ వంతెన నిర్మాణ పనులు ప్రారంభమై 6 సంవత్సరాలు పూర్తికా వస్తున్న వంతెనను పూర్తి చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమ య్యారన్నారు. ప్రభుత్వాలు మారుతున్న, పాలకులు మారుతున్న వంతెన నిర్మాణ దశలో ఎలాంటి మార్పు కనిపించడం లేదన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ మల్లేష్

వన్య మృగాలను వేటాడితే కఠిన చర్యలు

వాజేడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వన్యమృగాలను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ హెచ్చరించారు. గురువారం పేరూరు స్టేషన్ పరిధిలోని భువనపల్లి గ్రామస్థులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. వన్యమృగాలను వేటాడేందుకు కరెంటు ఉచ్చులు, ఇతర వేటాడే పరికరాలతో ఉచ్చులు అమర్చితే కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు. పంటలను కాపాడుకునే ఉద్దేశ్యంతో ఎవరూ కూడా కరెంటు ఉచ్చులు ఏర్పాటు చేయవద్దని ఆయన సూచించారు.

వీల్‌చైర్ పంపిణీ చేసిన సీఐ

వెంకటాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో గురువారం సీఐ బండారి కుమార్ శ్యామల శ్రీకాంత్‌కు వీల్‌చైర్ పంపిణీ చేశారు. వాజేడు మండలం బొల్లారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ గత కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి వెన్నుపూస విరిగిపోవడంతో కాళ్లు, చేతులు పని చేయకుండా పోయాయి. ఈవిషయం తెలుసుకున్న సీఐ కుమార్ బచ్చు రవికుమార్ సహకారంతో శ్రీకాంత్‌కు వీల్‌చైర్ అందజేశారు. చేయూత స్వచ్ఛంసంస్థ అధ్యక్షుడు సాయిప్రకాష్, సభ్యుడు వనపర్తి రవీందర్, ఏఎస్సై రామచంద్రు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురంలో వెలిసిన పోస్టర్లు

మంగపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపురంలోని బిల్ట్ ఫ్యాక్టరీ నుంచి మంజూరైన రూ.46లక్షల నిధులు గ్రామసభ తీర్మానం లేకుండా ఖర్చు పెట్టారని అనుమానం వ్యక్తంచేస్తూ బుధవారం రాత్రి పలుచోట్ల బిల్ట్ కార్మికుల పేరిట వాల్ పోస్టర్లు వెలిశాయి. ఆ పోస్టర్లలో ఫ్యాక్టరీ నుంచి రావాల్సిన రూ.2కోట్లు, రూ.1.54లక్షలను ఎప్పుడిస్తారోనని లిఖితపూర్వకంగా గ్రామస్థుల సమక్షంలో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. మూడు రోజుల్లో జవాబు చెప్పని యెడల నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇదేక్రమంలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కిషోర్‌కు వినతిపత్రం అందజేసి బిల్ట్ నిధుల ఖర్చులు వెల్లడించాలని కోరారు. బీజేపీ మండల కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు యాదగిరి, తిరుపతి, శివకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు తప్పవు

గోవిందరావుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో పంట పొలాలు, అడవుల్లో కరెంటుతీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై కమలాకర్ హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని బుస్సాపూర్, దుంపెల్లిగూడెం గ్రామాల్లో ప్రజలతో సమావేశమై మాట్లాడారు. కొందరు రైతులు తమ పంట పొలాలకు రక్షణ నిమిత్తం, కొంతమంది వన్యప్రాణులను వేటాడేందుకు కరెంటు తీగలు, ఉచ్చులు అమరుస్తున్నారని, దీంతో మనుషుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని అన్నారు. పంటల రక్షణ కోసం రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, లేనట్లయితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓసీ-3 ప్రమాదంపై డీడీఎంఎస్ విచారణ

కాకతీయఖని, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-3 క్వారీలో ఈ నెల 3న జరిగిన ప్రమాదంపై డీడీఎమ్మెఎస్ (మైనింగ్) కమలేష్‌కుమార్‌వర్మ విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం నుంచి గురువారం వరకు నాలుగు రోజుల పాటు ఓవర్ మెన్, సర్ధార్, అండర్ మేనేజర్, ప్రైవేటు ఆఫ్‌లోడ్ ఇన్‌చార్జీ, కాంట్రాక్ట్ ఆపరేటర్లు, ఇంజనీర్స్, మెకానికల్ ఫోర్‌మెన్ తదితరులను విచారించి వారి వద్ద స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు సమాచారం. ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలుస్తుంది.

బీజేపీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్

ములుగు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో గురువారం సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో నవంబరు 26, 2015న తొలిసారి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించడం జరిగిందని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, నాయకులు కొత్త సురేందర్, శీలమంతుల రవిం ద్రచారి, గంగిశెట్టి రాజ్‌కుమార్, రవిరెడ్డి, పాపిరెడ్డి, గట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ములుగు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన పూజారి రజిత(40) గురువారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. రజిత-రమేష్ దంపతులు గ్రామశివారులో కొంత భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. అడవి పందులు చొరబడి పంటను ధ్వంసం చేస్తుండటంతో వాటి నుంచి రక్షణ కోసం చేను చుట్టూ విద్యుత్ తీగలు అమర్చారు. గురువారం కూలీలతో కలిసి చేను వద్దకు వెళ్లిన రజితకు ప్రమాదవశాత్తు తీగలు తగిలాయి. దీంతో ఆమె ఘటనా స్థలిలోనే మరణించారు. భర్త రమేష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. వీరికి పవన్, పావని సంతానం ఉన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని వ్యక్తి ఆత్మహత్య

చిట్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపంతో పురుగల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ విశ్వకర్మ గత కొన్నేళ్లుగా మండలంలోని చల్లగరిగ గ్రామంలో పానీపూరి విక్రయిస్తు కుటుంబ సభ్యులతో ఇక్కడే నివాసం ఉంటున్నాడు. కాగా అతడి కుమారుడు మనీష్ విశ్వకర్మ(27)కు గత నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజులకే సదరు మహిళ ఇంట్లో ఎవరికి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయింది. దీంతో మనీష్ అప్పటి నుంచి మానసికంగా ఇబ్బందిపడుతుండేవాడన్నారు. ఈక్రమంలో బుధవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందుతాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న మనీష్ ఆరోగ్యం క్షీణించి గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తండ్రి పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మూడు రోజుల్లో ముగింపు..

(5వ పేజీ తరువాయి)

ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేదని అధికారులు చెబుతుండడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. బిల్లుల కోసం ఇంకెన్నాళ్లు వేచిచూడాలోనని ఆందోళన చెందుతున్నారు. పదవి కాలం ముగియడంతో తమకు భవిష్యత్‌లో ఎలాంటి పరిస్థితి ఎదుర్కొంటామోనని ఆందోళన చెందుతున్నారు.

- పెండింగ్‌లో... రూ.45కోట్ల పనులు..

భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో ఇంకా రూ.45కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. గడిచిన ఐదేళ్లలో చేపట్టిన పనులు రూ.110.20కోట్లు కాగా అందులో టీయూఎఫ్ఐడీసీ రూ.95కోట్లు, ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.3.20కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7.50కోట్లు ఉన్నాయి. ఇందులో సుమారు రూ.45కోట్లు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో 50శాతం పనులు ఒకే ఒక కాంట్రాక్టర్‌కు పెద్ద మొత్తంలో పనులు అప్పగించడం, ఆయన చేపట్టిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అలాగే మిగతా కాంట్రాక్టర్లకు సైతం బిల్లులు రాలేదు. దీంతో పట్టణంలోని 23, 28, 20 వార్డులలో పనులు ప్రారంభమే కాలేదు. ఇలా అభివృద్ధి కుంటుపడింది. అయితే పాలకవర్గం ఉంటేనే ప్రజలు అందుబాటులో ఉన్న వారికి సమస్యలు చెప్పి పరిష్కారం చేసుకునేవారని, ఇప్పుడు వారి పదవీకాలం ముగిస్తే తమ గోడు వినడానికి అధికారులు అందుబాటులో ఉంటారా..? అని ప్రశ్నలు ప్రజల నోటి వెంట తలెత్తుతున్నాయి.

మారిన రాజకీయ పరిణామాలు..

భూపాలపల్లి మునిసిపాలిటీలో రాజకీయ పరిణామాలు పూర్తిగా మారాయి. గతంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు అధికారం చేజిక్కించుకోగా ప్రస్తుత ఎ మ్మెల్యే కాంగ్రెస్‌కు చెందిన వారు కావడంతో పరిస్థితు లు మారాయి. గత మునిసిపల్ ఎన్నికల్లో భూపాలపల్లిలోని 30వార్డులలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు 24 మంది గెలుపొందగా, కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా కైవసం చేసుకోలేదు. అలాగే ఏఐఎఫ్‌బీ పార్టీ నుంచి ముగ్గురు, సీపీఐ నుంచి ఒక్కరు, బీజేపీ నుంచి ఒక్కరు, ఇండిపెండెంట్‌గా ఒక్కరు గెలిచారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లే చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కానీ ప్రస్తుతం జరిగిన నాటకీయ, రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 16 మంది, కాంగ్రెస్‌కు పార్టీలో చేరిన వారు 13 మంది, బీజేపీ ఒక్కరు ఉ న్నారు. పరిస్థితులు మారిపోవడంతో ఆశావహులు అధికార పార్టీ వైపు చూస్తున్నారు.